ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

గురువారం 23-04-2026 పేజీలు : 16



## రోడ్డెక్కని బస్సులు...

**- సమ్మె బాటలో ఆర్టీసీ కార్మికులు.**

**- మద్దతు ప్రకటించిన బిఆర్ఎస్.**

పరిగి, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర): తెలంగాణ ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. సమ్మెలో భాగంగా ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం పరిగి పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి, రెండు పిఅర్సీ బకాయిలు వెంటనే చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలను కల్పించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన విలీన ప్రక్రియను ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపివేశారని దానిని వెంటనే పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్

సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్, వారాల రవి, తాహెర్ అలీ, మీదిగడ్డ శ్రీనివాస్, ఆనం ఆంజనేయులు, శశాంక్ రెడ్డి, నరేష్ యాదవ్, నాయకులు సేవ్య నాయక్, ఇక్బాల్, ఆర్టీసీ కార్మికులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్ ప్రారంభించిన ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

**- ఆదివాసీలకు రాజధాని పర్యటక ప్రదేశాలను చూపిస్తాం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**



ఉట్నూర్, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడ గ్రామానికి చెందిన ఆదివాసులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్ ను ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. కొమురం భీమ్ విగ్రహానికి నివాళిలు అర్పించి, జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు కుమ్మరికుంట పర్యటనలో అక్షరాస్యతకు దూరంగా ఉండే గిరిజనులను అసలు ప్రపంచం తెలియదని వారికి రాష్ట్ర పర్యాటక మంత్రిగా రాష్ట్ర రాజధాని చూపించి అసలు ప్రపంచాన్ని చూపిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం అని, మొదటగా గోండు గూడ నుండి 250 మంది ఆదివాసీలను టూరిస్ట్ బస్సులతో యాత్ర ప్రారంభించాం అన్నారు. వారిని హైదరాబాద్ లోని విమానాశ్రయం, చార్మినార్, శిల్పారమం లాంటి పట్టణ అందాలను వివిధ పర్యాటక ప్రదేశాలను చూపిస్తాం అన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు అధికారుల పర్యవేక్షణలో ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, పివో యువరాజ్ మార్మాట్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గిరిజనులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం

13 పేజీలో...



## అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

**ఆర్ అండ్ బి అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సమీక్ష...**



9 పేజీలో...

## ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపిన బిజెపి నాయకులు

బాన్సువాడ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర). ఆర్టీసీ కార్మికులకు బుధవారం మద్దతు తెలిపిన బాన్సువాడ బిజెపి నాయకులు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఆర్టీసీ జేఏసీ కార్మికుల కు మద్దతు గా బాన్సువాడ భారతీయ జనతా పార్టీ నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, టౌన్ మండల అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, పొతంగల్ మాజీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు ప్రకాష్ పాటిల్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, టౌన్ ఉపాధ్యక్షులు గుడుగుట్ల అనిల్, గోపి, బల్వీర్ సింగ్, నాగరాజు కార్యకర్తలు ఆర్టీసీ సమ్మెకు మద్దతు పలికారు.

## ముగిసిన కదిరి రవీంద్ర నాథ్ రెడ్డి అంత్యక్రియలు

అనంతపురం ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ కాంట్రాక్టర్ దివంగత కదిరి కొండారెడ్డి (అడ్వకేట్) తనయుడు క్రీ.శే. కదిరి రవీంద్ర నాథ్ రెడ్డి (77) ఈ నెల 20న తుది శ్వాస విడిచిన నేపథ్యంలో ఆయన అంత్యక్రియలు బుధవారం కుటుంబ సభ్యులు బంధు మిత్రులు శ్రేయోభిలాషుల నడుమ గుత్తి రోడ్డులోని హరిశంద్ర ఘాట్ లో ముగిసాయి. ఈ సందర్బంగా అయన సతీమణి కదిరి క్రిష్ణమ్మా, కుమారుడు కదిరి సుజిత్ రెడ్డి లు తీవ్ర బావోద్వేగం తో కన్నీటి తర్యంత మయ్యారు.

## నాన్న ఆత్మ కు శాంతి కలగాలి –కదిరి సుజితరెడ్డి



అనంతపురం ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): మా తండ్రి గారైన క్రీ.శే దివంగత ప్రముఖ కాంట్రాక్టర్ కదిరి రవీంద్ర నాథ్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని మనసారా దేవుణ్ణి కోరుకుంటున్నానని అయన కుమారుడు డా. సుజిత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా సుజిత్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి అడుగు జడలో నడుస్తూ అయన ఆశయం కోసం నిరంతరం శ్రమిస్తూ ఉంటామని అన్నారు. నాన్న పంచిన తీపి జ్ఞాపకాలను ఎప్పటికి మరువమని సుజిత్ రెడ్డి అయన తండ్రిని గుర్తుచేసుకుంటూ తీవ్ర బావోద్వేగానికి లోనయ్యారు.

## కవిత భారీ సభ కు బాన్సువాడ నుండి జన సమీకరణ.

బాన్సువాడ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర). ఈనెల 25న కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ సభకు తరలి వెళ్లేందుకు బాన్సువాడ ప్రాంతం నుండి భారీ జన సమీకరణ చేస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. అమరుల ఆశయ సాధన కోసం, సామాజిక తెలంగాణ వికాసం కోసం కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం" అనే నినాదంతో ఈ నెల 25న హైదరాబాద్లో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో భారీ సభ జరుగుతున్నట్లు బాన్సువాడ నియోజకవర్గ బాధ్యులు మామిండ్ల రాజు, గూల సత్యనారాయణ, కిష్టపూర్ గంగాధర్ లు తెలిపారు. ఈ సభకోసం నియోజకవర్గం నుంచి సుమారు 50 వాహనాల్లో ప్రజలను తరలించనున్నట్లు తెలిపారు. బాన్స్ వాడ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. పార్టీ లో ఎవరు చేరినా సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు అమరుల ఆశయ సాధన, సామాజిక తెలంగాణ వికాసం నినాదం తో కొత్త రాజకీయ వేదిక ఆవిష్కృతం అవుతుందని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు ధరించిన పలువురు ఈ పోస్టర్ను ఆవిష్కరించారు. "రండి కదిలి రండి.. సర్వోదయ తెలంగాణకై కలిసి నడుద్దాం'' అనే నినాదంతో ప్రజలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పోస్టర్ ఆవిష్కరణలు, ప్రచారం చేస్తున్నామని తెలిపారు.



## ఘనంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎలిషా సార్‌కు వీడ్కోలు



చౌటకూర్ ఏప్రిల్ 22( విజన్ ఆంధ్ర) :- చౌటకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీ ఎలిషా సార్ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం ఆప్యాయతభరిత వాతావరణంలో కొనసాగింది. విద్యార్థులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు భావోద్వేగంతో ఎలిషా సార్‌కు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, ఎలిషా సార్ బోధనతో తాము ఆంగ్ల భాషపై మంచి పట్టు సాధించామని, ఆయన మార్గదర్శకత్వం తమ జీవితంలో ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన క్రమశిక్షణ, నిబద్ధత, విద్యార్థులపై చూపిన ప్రేమ ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక తహసీల్దార్ నామాల కృష్ణయ్య మాట్లాడుతూ, ఎలిషా సార్ సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. మండల అధికారిని అనురాధ, కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని ఎలిషా సార్‌కు శాలువాలు కప్పి సన్మానించారు. అలాగే ఎలిషా సార్ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో ఎలిషా సార్ మాట్లాడి, తన సేవా కాలంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సైతం సిద్ధశీ బిఏఐటీయూసీ



కొత్తగూడెం ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య,కొరిమి రాజ్ కుమార్ లు యాజమాన్యాన్ని హెచ్చరించారు. బుధవారం ఉదయం కొత్తగూడెం శేషగిరిభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాళ్ళు మాట్లాడుతూ చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని,లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె చేస్తామని య ాజమాన్యాన్ని హెచ్చరించారు. కారుణ్య ఉద్యోగాలపై ఏసీబీ విచారణ నిలిపివేయాలని,సంస్థలో కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ.50 వేల కోట్లను వెంటనే చెల్లించాలని వాటిని చెల్లించకుండా కావాలని సింగరేణి సంస్థను నష్టాల్లోకి తీసుకెళ్లి సింగరేణి సంస్థను సర్వనాశనం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా గత పది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు,యాజమాన్యం కలిసి,కొత్త గనులను ప్రారంభించకుండా సంస్థ లో కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని మెడికల్ బోర్డు నిలిపివేశారని మండి పడ్డారు. అదేవిధంగా క్రమంతప్పకుండా స్ట్రక్చర్ కమిటీను నిర్వహించి కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య,వై.వి రావు,కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్,బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య,వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్,నందబోయిన శ్రీనివాస్,గోపి,హుమాయూన్, నితిన్,గంగారం,మండల రాజేశ్వరరావు,లక్ష్మీనారాయణ, సోమయ్య,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్‌లో భద్రతా లోపాలపై తీవ్ర ఆందోళన....పితాని సందీప్ గౌడ్

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) ఏప్రిల్ 22: జెఎన్టియుహెచ్ లో భద్రతా వ్యవస్థపై గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న అనేక అనుమానాస్పద అంశాలు మరియు భద్రతా లోపాలపై ఈ క్రింది అంశాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాము.

ముఖ్య అంశాలు: 1.2015 సంవత్సరంలో, అప్పటి ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ శైలజా రామయ్యర్ హయాంలో శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థను జేఎన్‌టీయూహెచ్‌లో భద్రతా సేవల కోసం నియమించారు. అయితే సాధారణంగా ఇలాంటి ఒప్పందాలు ప్రతి సంవత్సరం కి ఒకసారి లేదా కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారైనా రీన్యువల్ చేయాల్సి ఉంటుంది. 2.2015 నుండి ఇప్పటివరకు కేవలం 2019 సంవత్సరంలో మాత్రమే ఈ సెక్యూరిటీ కాంట్రాక్ట్ రీన్యువల్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రతి సంవత్సరం రీన్యువల్ ఎందుకు జరగలేదు అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. 3.గత 11 సంవత్సరాలుగా ఒక్కసారి కూడా కొత్త టెండర్ వేయకుండా అదే సెక్యూరిటీ ఏజెన్సీని కొనసాగించడం పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తోంది. 4.సుమారు 200 మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది శ్రీ కార్తికేయ సెక్యూరిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. కానీ వీరి పని విధానం, నియమ నిబంధనలు, పర్యవేక్షణ వ్యవస్థలపై స్పష్టత లేదు. 5.శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సంస్థ మేనేజర్/ఓనర్ రాజశేఖర్ రెడ్డి యూనివర్సిటీలో జరిగే అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా రాత్రి సమయంలో జరిగే గొడవలు, నాన్-బోర్డర్స్ మరియు పాసౌట్ విద్యార్థులు ఐడి కార్డులు లేకుండా క్యాంపస్‌లోకి రావడం వంటి అంశాలకు బాధ్యత వహించాలి.

6.వీరబాబు అనే సెక్యూరిటీ సూపర్‌వైజర్ / అసిస్టెంట్ మేనేజర్ ఈ కార్యకలాపాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాబట్టి ఆయనే కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. 7.కొన్ని విద్యార్థి నాయకులను మేనేజ్ చేస్తూ, ప్రతి నెలా లక్షల రూపాయలు సెక్యూరిటీ ఏజెన్సీ చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని ద్వారా వారికి నచ్చిన వారిని ఎప్పుడైనా క్యాంపస్‌లోకి అనుమతించడం జరుగుతోంది. అలాగే క్యాంపస్‌లో ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారు అన్న సమాచారాన్ని కూడా పంచుతున్నట్లు సమాచారం. 8.నాన్-బోర్డర్స్ క్యాంపస్‌లోకి వచ్చి మద్యం సేవించడం, విద్యార్థుల మధ్య గొడవలు పెట్టడం, విద్యార్థులను కొట్టడం వంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ఇది యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. 9.ఇంత పెద్ద టెక్నాలజికల్ యూనివర్సిటీలో మెయిన్ గేట్ వద్ద సరైన సెక్యూరిటీ మెషిన్లు, బ్యాగ్ స్కానింగ్ మెషిన్లు లేకపోవడం పెద్ద లోపం. రాత్రి సమయంలో వచ్చే వారి బ్యాగులను చెక్ చేయడం లేదు. స్కానింగ్ మెషిన్ ఉంటే కొన్ని సెకన్లలోనే చెకింగ్ పూర్తవుతుంది. క్యాంపస్‌లోకి మద్యం బాటిళ్లు రావడానికి ఇదే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

10.ఇటీవల ఒక వారం క్రితం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీకి బాంబ్ థ్రెట్ రావడం వేలాది మంది విద్యార్థుల్లో తీవ్ర భయాందోళనలు కలిగించింది. ఇది యూనివర్సిటీలో భద్రతా లోపాలు ఉన్నాయని స్పష్టంగా సూచిస్తుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు తీసుకోవాలి. 11.ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్సిటీ భద్రతను పటిష్టం చేయడానికి వెంటనే కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టాలి, భద్రతా సిబ్బందిపై కఠిన పర్యవేక్షణ ఉండాలి, ఆధునిక భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలి మరియు అన్ని అక్రమ కార్యకలాపాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలి.

## దోమల మందు పిచికారి చేయించిన సర్పంచ్ మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్

అందోల్ ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ప్రతినిధి) మెదక్ జిల్లా అల్లాదుర్గం పట్టణంలో మంగళవారం రాత్రి సర్పంచ్ మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీధుల వారీగా దోమల మందు పిచికారి చేయించడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ముమ్మర పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని, పరిసరాలను మాతో పాటు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం వైపు అడుగులు వేస్తున్నామని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలి అంటే ప్రజల యొక్క భాగస్వామ్యం ముఖ్యమని, ప్రజలందరూ సహకరించి పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వర్షాకాలం రీత్యా పరిసరాలు పరిశు భ్రంగా లేకపోతే అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది కాబట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా దోమల బారి నుండి మనం రక్షించుకోవాలంటే మన ఇంటి చుట్టూ పరిసరాలను, పరిశుభ్రంగా చూసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది,మద్దూరి సురేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినికి సన్మానం



జన్నారం, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : రోటీగూడ గ ల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో విద్యా ర్థినిని ఘనంగా సన్మానించారు. జన్నారం మండలం లోని రోటీగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కమిటీ స భ్యుడు వర్కింగ్ ప్రెసిడెంట్ పాలజీ శ్రీనివాస్ మాల తీ దంపతుల కుమార్తె పాలజీ రక్షిత ఇంటర్మీడియ ట్ లో 989 మార్కులు సాధించిన సందర్భంగా బు ధవారం రోజున అదే గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మి కుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రక్షిత తోపాటు ఆమె తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటీగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ స మితి వ్యవస్థాపకులు సేపూరి గోపాల్ మాట్లాడు తూ పాలజీ రక్షిత 5వ తరగతి నుండి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించి, అ తరువాత గు రుకుల హసన్‌పర్తి కళాశాలలో ఇంటర్మీడియట్ చ దివి ఈస్థాయిలో అద్భుతమైన మార్కులు సాధిం చడం ఎంతో గర్వకారణమని అన్నారు. గల్ఫ్‌లో కష్టపడుతున్న కార్మికుల పిల్లలు కూడా చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవా లని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పు సురేష్, పా లజీ శ్రీనివాస్, శివనూరి శ్రీనివాస్, ఉప్పు మల్లేశం, ఉప్పు రవి, జిల్లాపెల్లి మహేష్, కొల నరేష్, ఒడ్డెటి రమేష్, పాలజీ కృష్ణ కుమార్, గ్రామస్తులు పాల్గొ న్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి..



కుకునూరుపల్లి, ఏప్రిల్ 22,విజన్ ఆంధ్ర : బుధవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో జరిగిన నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూం కుంట ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజా పాలనలోనే సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. మండల కేంద్రంలోని బోదపట్ల కృష్ణ అనే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పూర్తి చేస్కోవడంతో ఆమె గృహ ప్రవేశ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రిబ్బన్ ను కత్తిరించి, లబ్ధిదారులతో కలిసి ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వీరుపాక శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు ఇంద్ల కనకయ్య, బోదపట్ల ఐలం శివ, కందూరి ఐలయ్య, పిప్ప అమరేందర్, రెడ్డమైన రవీందర్, కోల ఉపేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పొద్దుటూరి శ్రీనివాస్ గుప్తా, శివలింగు సత్యం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొంతం కర్ణాకర్, ఈగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలనలో ప్రశ్నించే ప్రతి గొంతుక అర్బన్ నక్సలైట్.




టేకులపల్లి విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : సిపిఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లిలో కాచి నపల్లి అమరవీరుల స్తూపం వద్ద ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడం జరిగింది .
ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జెండాను ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్జ ఎగుర వేయడం జరిగింది. అనంతరం. ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి .ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిజం అజయమైనదని పేద ప్రజలు ఉన్నంతవరకు కమ్యూనిజం ఉంటుందని దీనిని నిర్మూలించడం కోసం పాలకులు శతవిధాల ప్రయత్నం చేస్తున్నారని అయినా తారతమ్యాలు లేని సమాజం ఉన్నంతవరకు ఎర్రజెండా ఉంటుందని కనుక పాలకులు, కమ్యూ నిజాన్ని నిర్మూలించాలంటే ముందుగా పేదలు లేని దేశంగా మార్చాలని అందరూ సమానత్వం తో జీవించినప్పుడే అది సా ధ్యమవుతుందని అన్నారు
తారతమ్యాలు ఉన్నంతవరకు కమ్యూనిజం వర్ధిల్లుతుందని అది అజయమైనదని అన్నారు. ఆకలి ఉన్నంతవరకు పేదలు ఉన్నంత వరకు కమ్యూనిజం ఉండి తీరుతుందని అన్నారు. పాలకులు ప్రశ్నించే ప్రతి వాడిని అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని దీనికి వ్యతిరేకంగా దేశ ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు దేశ పౌర సమాజం నిరసనగలం ఇవ్వాలని అన్నారు. పేద ప్రజల కోసం ఉద్యమించి అశులు బాసిన కాచినపల్లి అమరవీరులకు విప్లవోద్యమంలో అమరులైన అమరవీరులందరికీ విప్లవ జోహార్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏ ఐ కె యం ఎస్ జిల్లా నాయకులు భూక్య హర్జ, ఎట్టి నరసింహారావు, గుగులోత్ రామచందర్, బానోత్ వెంకట్రాం, ధరావత్ పాండ్యా, కొడెం రవి, తోటకూరి సతీష్, బోడ మంచా, తదితరులు పాల్గొన్నారు.

## భూమిని కాపాడుకోకపోతే వినాశనం తప్పదు

**-లయన్ అన్నెం కోటిరెడ్డి హెచ్చరిక**

**-ఎర్రగడ్డ కల్పతరు రెసిడెన్సీలో ఘనంగా 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'**

**-పిల్లలకు ఆస్తులు కాదు.. స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వడమే నిజమైన సంపద**



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర):"ఈ భూమి మనకు జన్మనిచ్చిన తల్లి వంటిది. స్వచ్ఛమైన గాలిని, తియ్యని నీటిని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రసాదించే కన్నతల్లికి మనం తిరిగి విషాన్ని ఇస్తున్నాం. మన స్వార్థం వల్ల భూమిని కలుషితం చేస్తూ మన వినాశనాన్ని మనమే కొనితెచ్చుకుంటున్నాం" అని లయన్స్ ఇంటర్నేషనల్ 320–ఐ జిల్లా పర్యావరణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎర్రగడ్డలోని కల్పతరు రెసిడెన్సీలో నిర్వహించిన ప్రపంచ ధరిత్రీ దినోత్సవ (వరల్డ్ ఎర్త్ డే) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

మన కంచంలోనే విషం!

ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ, ఆధునిక మానవుడు భూమిని ఒక చెత్త కుప్పగా మార్చేస్తున్నాడని విమర్శించారు. "విచ్చలవిడి పురుగుమందుల వాడకం, కెమికల్, సాల్వెంట్ పరిశ్రమల వ్యర్థాలు, ప్లాస్టిక్ చెత్తను భూమిలో కుమ్మరించడం వల్ల నేల తల్లి విషతుల్యమవుతోంది. పరోక్షంగా ఆ విషమే మన కంచంలోకి ఆహారం రూపంలో వస్తోంది. అందుకే మన పూర్వీకులు శతాధిక వయస్సు వరకు ఆరోగ్యంగా జీవిస్తే, నేడు 40 ఏళ్లకే షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులతో 60 ఏళ్లకే ప్రాణాలు వదులుతున్నాం" అని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణే లయన్స్ లక్ష్యం

ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లయన్ అరవింద్ పాల్ సింగ్ పిలుపు మేరకు, జిల్లా గవర్నర్ ఎమ్.జె.ఎఫ్ లయన్ అరవెల్లి అమరనాథ్ రావు నేతృత్వంలో లయన్స్ 320–ఐ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉ ందని ఆయన స్పష్టం చేశారు. "మనం మన పిల్లలకు కోట్లాది రూపాయల ఆస్తులు ఇవ్వక్కర్లేదు. వారు శ్వాసించడానికి శుద్ధమైన గాలి, తాగడానికి స్వచ్ఛమైన నీరు, నివసించడానికి కాలుష్యం లేని భూమిని ఇస్తే చాలు. అదే కోటి రూపాయల ఆస్తితో సమానం" అని హితవు పలికారు.

ముక్కోటి ప్రతిజ్ఞ

నీరు, నేల, గాలి – ఈ మూడింటినీ కంటికి రెప్పలా కాపాడతాం. భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అప్పగిస్తాం" అని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని కోటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ డేవిడ్ రాజు, జోన్ చైర్మన్ లయన్ డా. ప్రఫుల్ రెడ్డి, లయన్ వి. తిరుపతి రెడ్డి, బోర్డ్ డైరెక్టర్ లయన్ సిహెచ్. హనుమంత్ నాయుడు, లయన్ నాగేశ్వరావు, లయన్ జి. రమణారెడ్డి, లయన్ టి. శివారెడ్డి తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణపై తమ గళాన్ని వినిపించారు.

# ఆదివాసీ న్యాయ కళాశాల పోరాటంతోనే సాధ్యం



## .. జి ఎస్ పీ రాష్ట్ర కార్యదర్శి. పూనెం సాయి దొర

వెంకటాపురం నూగూరు ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర : వెంకటాపురం మండలం మల్లాపురం గ్రామంలో బుధవారం ఆదివాసి యువత సమావేశంలో మడకం ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీవిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర. పాల్గొని,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆదివాసి న్యాయకలశాల ఏర్పాటు అయితే ఆదివాసి యువత ఆదివాసి చట్టాలపై అవగాహన ఉంటుందని తమ భూములకి రక్షణగా ఉంటారని జి ఎస్ పి పోరాట ఫలితంగానే భద్రాచలంలో డిగ్రీ ఎస్ఎంఎస్ హాస్టల్ సాధించుకోవడం జరిగిందని.అలాగే బీఈడీ కళాశాల కూడా పోరాట ఫలితంగానే సాధించుకున్నామని అలాగే పోరాటంతోనే భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాల కూడా సాధిస్తామని ఆయన అన్నారు.రాష్ట్ర విభజన అనంతరం గత ప్రభుత్వం హాయంలో భద్రాచలం నియోజకవర్గం రాష్ట్రంలోని అతిపెద్ద ఆదివాసి నియోజకవర్గాన్ని,టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆదివాసీలను ముక్కలు చెక్కలుగా విభజించి పాలించారని గుర్తు చేశారు. 1976లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయంలో ఓటు బ్యాంకు కోసం ఎమర్జెన్సీ లో లంబాడీలను ఎస్టీ జాబితాలో కలిపి ఆదివాసులకు తీరని అన్యాయం చేశారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. షెడ్యూల్ ఏరియాలో ఆదివాసి చట్టాలను అమలు చేయాలని ఆదివాసి ఎమ్మెల్యేలు ఆదివాసి రిజర్వేషన్ తోని గెలుపొంది ఆదివాసి చట్టాలను అమలు చేయాలని ఏ రోజు కూడా అసెంబ్లీలో మాట్లాడలేకపోవడం చాలా బాధాకరమని ఆయన అన్నారు .న్యాయ కళాశాల ఏర్పాటు చేసేవరకు ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆదివాసి యువతకు ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశంలో మడకం పాపారావు,పండ,అరుణ్ పండ,గణపతి,పండ,శ్రీను మడకం రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



## -ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేసి సమ్మె విరమింప చేయాలి

## - వివిధ పార్టీల నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సుద్దాల చంద్రయ్య, పచ్చిమట్ల రవీందర్ గౌడ్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : రాష్ట్రములో ఆర్టీసీ కార్మికులు న్యాయపరమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్ఎస్ నాయకులపై అక్కసు వెళ్లగక్కుతూ మాట్లాడడం సరికాదని సమ్మె వెనక బీఆర్ఎస్ నాయకుల కుట్ర దాగి ఉందని అనడం హాస్యాస్పదంగా ఉందని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంత బిఆర్ఎస్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ సందర్బంగా బుధవారం రోజున ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా ఆయన డిపో ఎదుట ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న హామీలనే నెరవేర్చాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారని వాటిని పక్కన పెట్టి బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి మాట్లాడడం మంత్రికి సరికాదని ఆయన అన్నారు.ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీన ప్రక్రియ ప్రారంభించి కార్మికులచే సమ్మెను విరమింప చేయాలని ఆయన కోరారు ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ప్రజా రవాణా స్తంభించిందని దీంతో అనేకమంది ప్రజలు రవాణాకు అవస్థలు పడుతున్నారని ఈ సమస్యలన్నిటిని దృష్టిలో పెట్టుకొని కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు బుర్ర శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. హుస్నాబాద్ డిపోలో ఆర్టీసీ కార్మికులు వివిధ రాజకీయ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు.మహిళా కండక్టర్లు బతుకమ్మ ఆటలాడుతు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి ఆర్టీసీ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

## -హుస్నాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : దేశ ప్రధానమంత్రిని ఉగ్రవాది అని అనడం ఖర్గే అహంకారానికి నిదర్శనం అని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు విమర్శించారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు విలేకరులతో మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు టెర్రరిస్టు అని అనడం సిగ్గుచేటు,ఖర్గే వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ పట్టణ శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.దేశ ప్రధానిని గౌరవించలేని కాంగ్రెస్ నాయకులు దేశ ప్రజలను, భారత రాజ్యాంగాన్ని ఏవిధంగా గౌరవిస్తారో దేశ ప్రజలు ఆలోచించాలని కోరారు.ప్రజాస్వామ్య దేశంలో ప్రజలతో ఎన్నికైన దేశ ప్రధానిని టెర్రరిస్టుగా సంబోధిస్తూ, అవహేళన చేయడం రాజ్యాంగ విలువలను దెబ్బ తీసే విధంగా ఉన్నాయని, ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఖర్గే పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ ఎప్పుడూ చూసిన రాజ్యాంగ పుస్తకం చేతిలో పట్టుకుని తిరుగుతారు కానీ ప్రధానమంత్రి గౌరవించే గుణం లేని నాయకులు కాంగ్రెస్ పార్టీ వారని విమర్శించారు. వెంటనే ఖర్గే వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాబోయే కాలంలో దేశ ప్రజలే ఖర్గేకు,కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చేబుతరన్నారన్నారు.

# చిన్నారికి ఆశీస్సులు అందించిన కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల్ మండలం మైలారం గ్రామపంచాయతీలో యువజన కాంగ్రెస్ నాయకులు పోలవేణి మహేష్--సరిత దంపతుల కుమార్తె కర్ణవేదన కార్యక్రమంకు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

ఈకార్యక్రమంలో నెన్నెల మండల బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కొమ్ము రాజన్న, ఓబీసీ జిల్లా కో-చైర్మన్ బండి లక్ష్మణ్, గొల్లపల్లె గ్రామ అధ్యక్షులు తమ్మినేని రాజేష్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాబు యాదవ్, పిల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు చిన్నారి ఆయురారోగ్యాలతో ఎదగాలని ఆకాంక్షించారు..

# అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు

## – తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి





నిజామాబాద్, ఏప్రిల్ 22 :( విజన్ ఆంధ్ర) అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు జారీ అయ్యేలా తెలంగాణ మీడియా అకాడమీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎవరికీ అన్యాయం జరుగకుండా చూస్తామని భరోసా కల్పించారు. నిజామాబాద్ నగర ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు వెల్ నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, జర్నలిస్టులకు లాంఛనంగా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ నాలుగవ విడత సమావేశం గురువారం జరగనుందని తెలిపారు. జర్నలిస్టు సంఘాలు, పాత్రికేయుల అభ్యర్థనల మేరకు అక్రిడిటేషన్ల జారీ కోసం ఉద్దేశించిన 252 జీఓలో అవసరమైన సవరణలు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ తప్పనిసరిగా అక్రిడిటేషన్లు జారీ అవుతాయని అన్నారు. స్పోర్ట్స్ జర్నలిస్ట్ లు, కార్టూనిస్టులు, ఫిలిం, కల్చరల్ జర్నలిస్టులకు కూడా కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మీడియా అకాడమీ చర్యలు తీసుకుందని అన్నారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని చెప్పారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే విధి విధానాల కోసం సబ్ కమిటీ వేశామని, కమిటీ నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జర్నలిజంతో సంబంధం లేని వారికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రిడిటేషన్లు జారీ కాకుండా చూడాలన్నారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఉన్నాయని, ఇదివరకటి తరహాలోనే ఈసారి కూడా కార్డులు జారీ చేయబడతాయని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ విషయమై రెండు మూడు రోజుల్లోనే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రితో భేటీ ఉందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని నమ్మకం ఉందన్నారు. కాగా, జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చి హెల్త్ కార్డులు అందించిన వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కవితా రెడ్డి, డీపీఆర్ఓ పద్మశ్రీ, వెల్ నెస్ ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు అసద్ ఖాన్, ముబీన్ పటేల్, భార్గవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, సుభాష్, కోశాధికారి బి రాజకుమార్ సాక్షి ఫోటోగ్రాఫర్ కార్యవర్గ సభ్యులు, సితార కృష్ణ పబ్బు భూమేష్ రవి చరణ్ రెడ్డి. జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## ఫోన్ పక్కన పెడితేనే పిల్లల ఎదుగుదల ముందుకు

### - సర్పంచ్ పంజ స్వామి

దౌల్తాబాద్,ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర): గాజులపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమం సందర్భంగా తల్లిదండ్రులు, పిల్లలతో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పంజ స్వామి మాట్లాడుతూ , సురక్షిత డిజిటల్ అలవాట్లు,ప్రత్యామ్నాయంగా బయట క్రీడా కార్యకలాపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పిల్లలు ఫోన్ ఉపయోగించే సమయం తగ్గించడం,నిద్రకు ముందు సెల్ ఫోన్ వినియోగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై తల్లిదండ్రులకు సూచనలు ఇచ్చారు. అలాగే పిల్లలకు పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, ఆటలు ఆడించడం వంటి అవుట్‌డోర్ కార్యకలాపాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పాయిగూడెంలో చలివేంద్రం ఏర్పాటు



కారేపల్లి,ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) మండల పరిధిలోని అప్పాయి గూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వేసవి నేపథ్యంలో బాటసారుల, ప్రయాణికులు,ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు. డిఎల్పిఓ రాంబాబు మాట్లాడుతూ...మండుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావు,కార్యదర్శి కృష్ణవేణి ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్, కారేపల్లి కార్యదర్శి నెహ్రూ,మండల సర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిర సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర): ఉచిత వైద్య శిబిర సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్ తెలిపారు. మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన డా.వివేక్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కుల్కచర్లలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. కాలేయ, ఉదర సంబంధిత వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యుడు వివేక్ మాట్లాడుతూ... అనారోగ్య సమస్య ఏర్పడితే ప్రారంభ దశలో వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఉదర సంబంధ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీడీవో రామకృష్ణ నాయక్, దిశా కమిటీ సభ్యులు జానకీరాం, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గుత్తి కోయ గ్రామాల్లో మలేరియా సర్వే -- వైద్య బృందం విస్తృత తనిఖీలు

టేకులపల్లి, విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మరియు స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ ఆదేశానుసారం, స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి నేతృత్వంలోని వైద్య బృందం టేకులపల్లి మండలంలోని గుత్తి కోయ గుంపు గ్రామాలైన మోట్లగూడెం, సిద్ధారం, నాగారవు, జోగుల్లో మలేరియా జ్వర లక్షణాల గుర్తింపు సర్వే చేపట్టింది. మలేరియా ప్రభావం అధికంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ప్రజలు తరచుగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి రావడం వల్ల మలేరియా కేసులు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు నివారణ చర్యలలో భాగంగా తరచూ మలేరియా సర్వేలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిర్వహించిన సర్వేలో గ్రామ ప్రజల నుండి రక్త నమూనాలు సేకరించి, త్వరితగతిన ఫలితాలు ఇచ్చే పరీక్షల ద్వారా మలేరియా గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మలేరియా వ్యాధి లక్షణాలు, నిర్లక్ష్యం చేస్తే కలిగే ప్రాణాపాయం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, ప్రభుత్వం అందజేసిన దోమతెరలను తప్పనిసరిగా ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ యూనిట్ అధికారి జాబిశెట్టి శ్రీనివాసరావు, మలేరియా నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, పల్లె దవాఖాన వైద్యురాలు చందన, శైలజ, స్రవంతి, ధనసరి రాంబాబు, కవిత, సారమ్మ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, సింగరేణి నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## 131 రాజ్యాంగ సవరణ బిల్లును తిప్పికొట్టిన ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలకు కృతజ్ఞతలు

### - ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు

వెంకటాపురం (నూగూరు) ఏప్రిల్ 22 విజన్( ఆంధ్ర ) : పార్లమెంటు లో 17వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించి, వీగిపోయేవిధంగా ఓటు వేసిన ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీల కు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును మహిళా రిజర్వేషన్ అనే బిల్లు మాటున పార్లమెంటు లో ప్రవేశ పెట్టిన తీరును ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించి సమర్థవంతంగా ఎదుర్కొని, దేశాన్ని మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల కు పెద్ద ఉపద్రవంను తొలగించారు అని అన్నారు. గత ప్రధానులు ఇందిరా, వాజ్పాయ్ ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేపట్టిన దక్షిణాది రాష్ట్రాలు డి లిమిటేషన్ లో నష్టపోకుడదని రాజ్యాంగ సవరణ ద్వారా సీట్ల పెంపును దేశ ప్రయోజనాల దృష్ట్యా నిలిపి వేశారు. కానీ ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం రాజకీయ కారణాల కోసం జనాభా సాకుతో ఉత్తరాది రాష్ట్రాల సీట్లను పెంచి ,పార్లమెంటు లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంను నామ మాత్రం చేయాలని కుట్రలను ,తమఅధికారం ద్వారా రాజ్యాంగాన్ని సవరణ చేసి సుస్థిరం చేసుకోవాలి అనే దురుద్దేశాన్ని ఇండియా బ్లాక్ పార్టీలు తిప్పికొట్టాయి అన్నారు. ఈ సందర్భంగా ఇండియా బ్లాక్ ఎంపీలను సంఘటితం చేసిన కన్వీనర్, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే , ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కి ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు బుధవారం ఓప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.



## తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

### -సర్పంచ్ ఉప్పల దాసు

దౌల్తాబాద్,ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట మన ఊరు మన బడి కార్యక్రమం గోవిందపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల దాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ముఖ్యంగా తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రామంలో కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు వంటి సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. మౌనిక, ఉపాధ్యాయురాలు బి.మమత తో పాటు అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.




## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్



పరిగి, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ): కలియుగ ప్రత్యక్ష దైవం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, ఉమారెడ్డి దంపతులు, నూతన దంపతులు కుమార్తె మేఘన రెడ్డి, అల్లుడు సంతోష్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తాము కోరుకున్న కోర్కెలు నెరవేరినందుకు మొక్కులు చెల్లించారు.

# మధుర మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

## - రోడా మేస్త్రీ నగర్‌లో వైభవంగా బోనాల ఉత్సవాలు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రోడా మేస్త్రీ నగర్ డివిజన్‌లో వెలసిన శ్రీశ్రీశ్రీ మధుర మీనాక్షి అమ్మవారు, వీరభద్ర స్వామి వారి ఆలయంలో బోనాల మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి:

ఆలయానికి చేరుకున్న కూన శ్రీశైలం గౌడ్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి, వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఆ మధుర మీనాక్షి అమ్మవారి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. లోక కల్యాణం కోసం భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో, ఆధ్యాత్మిక కోలాహలంతో సందడిగా మారింది.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు

## -- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 22, (విజన్ ఆంద్ర) : అర్హులైన ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుదవారం చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట, నష్కల్ గ్రామాలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేశారు. పల్లగుట్ట గ్రామంలో 20లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇల్లు, 25లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం మరియు ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నష్కల్ గ్రామంలో 27లక్షల 50వేల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను, ఇందిరమ్మ ఇల్లు ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్నాలకు రూ 500 బోనస్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని తెలిపారు. త్వరలోనే 2లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద చనిపోతే 15 రోజులలో 5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. నష్కల్ నుండి ఉప్పుగల్ రోడ్డు మరియు ఆకేరు వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి 15కోట్లు ఖర్చు అవుతాయాని 3నెలల్లో ముఖ్యమంత్రితో మాట్లాడి బ్రిడ్జ మరియు రోడ్డు నిర్మాణానికి 15కోట్లు మంజూరు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూరుగుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, సర్పంచులు నరసింహా రెడ్డి, శాతబోయిన రాజు, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# సూరారం గడ్డపై హిందూ ఐక్యతకు పిలుపు

## - మే 10న శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవం

## -రాజకీయాలు, విభేదాలు పక్కనపెట్టి ధర్మం కోసం ఏకం కావాలి: నేడు సన్నాహక సమావేశం

సూరారం, ఏప్రిల్ 22: (విజన్ ఆంధ్ర); భారతీయ హైందవ సంస్కృతికి, పరాక్రమానికి నిలువెత్తు రూపం ఛత్రపతి శివాజీ మహారాజ్. ఆ మహోన్నత వీరుడి పట్టాభిషేక మహోత్సవాన్ని సూరారం గడ్డపై అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి. మే 10వ తేదీన జరగనున్న ఈ మహా వేడుకను పురస్కరించుకుని, హిందూ బంధువులందరినీ ఏకం చేసేందుకు నిర్వహకులు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

**విభేదాలు వీడి.. ధర్మ రక్షణే లక్ష్యంగా!**

వ్యక్తిగత అభిప్రాయ బేధాలు, రాజకీయ పార్టీల విభేదాలు ఏవైనా ఉన్నప్పటికీ, ధర్మం కోసం వాటన్నింటినీ పక్కన పెట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. "మనం ఏ పార్టీలో ఉన్నా, మన మధ్య ఏ గొడవలు ఉన్నా.. హిందువులందరూ ఒక్కటే అని చాటిచెప్పే సమయం ఆసన్నమైంది" అని వారు పేర్కొన్నారు. సూరారంలో హిందూ ఐక్యతను చాటిచెప్పే విధంగా ఈ ఉత్సవం ఉండబోతోందని వెల్లడించారు.

**సన్నాహక సమావేశం వివరాలు**

ఈ ఉత్సవానికి సంబంధించిన విధివిధానాలు, ఏర్పాట్లు, మన సంఖ్యాబలాన్ని చాటిచెప్పేందుకు ఏప్రిల్ 26 ఒక ముఖ్యమైన సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సమావేశ వివరాలు: తేదీ: 26 ఏప్రిల్ 2026 (ఆదివారం) సమయం: సాయంత్రం 5:00 గంటలకు

వేదిక: నీలిమ హై స్కూల్, రాంలీల మైదానం పక్కన, సూరారం కాలనీ.

**భారీ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి**

భారతమాత సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని విజయవంతం చేయడం మనందరి బాధ్యత అని నిర్వాహక కమిటీ కోరింది. సూరారం కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాలలోని హిందూ బంధువులందరూ ఈ సమావేశానికి తరలివచ్చి, ఉత్సవ జయప్రదానికి సూచనలు, సలహాలు అందించాలని కోరారు. జై శ్రీరామ్.. భారత్ మాతా కీ జై!" నినాదాలతో సూరారం పరిసరాలు మార్మోగనున్నాయి.

# పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ రాఘవులు...



కారేపల్లి ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : గుట్ట కింది గుంపు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 5 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్ రాఘవులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉండం రాఘవులు మాట్లాడుతూ..పాఠశాల అభివృద్ధి గ్రామ అభివృద్ధికి మూలస్థంభమని పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రత కల్పించేందుకు ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని అన్నారు. ప్రహరీ గోడ నిర్మాణానికి డియం ఎఫ్ టి నిధులు మంజూరు చేసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వీన్ ఖాసీం, గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణ రావు, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ షబ్బీర్, ఈసం లక్ష్మీనర్సు, వార్డు సభ్యులు, గ్రామస్తులు స్థానిక నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగి వున్న టిప్పర్‌ను బైక్‌తో ఢీకొనడంతో వ్యక్తి మృతి



జన్నారం, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : ఆగి వున్న టిప్పర్ ను బైక్ పై వచ్చి ఢీకొనడంతో వ్యక్తి అక్కడి కక్కడే మృతిచెందాడు. జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన బిల్ల మహేందర్(50) అనే వ్యక్తి మంగళవారంరోజు రాత్రి లక్షటిపేట నుం డి జన్నారం వస్తున్న క్రమంలో తపాలపూర్ అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద ఆగి వున్న టిప్పర్ ను వెనుక నుండి ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు ని పరిశీలించి మృతదేహాన్ని లక్షటిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# తాడుకోల్ గ్రామంలో హెల్త్ క్యాంప్

బాన్సువాడ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర). తాడుకోలు గ్రామంలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ అందే రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. టీ.బీ ముక్త భారత్ అభియాన్ లో భాగంగా తడ్కోల్ గ్రామంలో ఎక్స్‌రే క్యాంపు నిర్వహించడం జరిగింది అని అన్నారు. 2 వారాల కు మించి దగ్గు, జ్వరం రావడం, బీపీ, షుగర్ ఉన్నవారి కి 60 సంవత్సరా ల పైబడి న వారి కి ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ టి ఎస్ శరత్, రేడియోగ్రాఫర్ కళ్యాణ్ , ఏఎన్ఎం కల్పన, ఎం.ఎల్.హెచ్.పి లు మనసా, హిమాబిందు ఆశా కార్యకర్తలు గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.



# ధరిత్రిని కాపాడుకుందాం.. భావితరాలకు పచ్చదనాన్ని అందిద్దాం!



## లోత్తొరె గ్రామ గిరిజనులకు నీటి కష్టాలు.
## - బోరింగ్ ను రిపైర్ చేయించిన సర్పంచ్.

జన్నారం, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : లోత్తొరె గ్రా మంలో సరైన నీటి సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బం దులు పడుతున్నారని సర్పంచ్ బోడ శంకర్ పాత బోరింగ్ ను రిపైర్ చేయించాడు.జన్నారం మండ లంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన లోత్తొరె గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరిగా రకపోవడ దం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గిరిజను లకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ సందర్భం గా స్థానిక సర్పంచ్ బోడ శంకర్ గ్రామంలోని సరిగా నీరు రాణి పాత బోరింగ్ ను రిపైర్ చేయించి గిరిజ నులకు కొంత మేరకు నీటి సమస్యకు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందిం చారు.

## బైర్ఖాన్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన కేశంపేట ఎంపీడీవో రవి చంద్ర

కేశంపేట ఏప్రిల్ 23(విజన్ ఆంధ్ర) : కేశంపేట మండల పరిధిలోని బైర్ఖాన్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించిన కేశంపేట ఎంపీడీఓ రవి చంద్ర మరియు టీ ఏ శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ బైకని శమంతా యాదయ్య యాదవ్. ఈ ఉపాధి హామీ పనిలో భాగంగా గ్రామానికి చెందిన దాదాపు 40 మంది కార్మికులు పాల్గొని పనులను ప్రారంభించారు, కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజులు ఉ పాధి హామీ ఇస్తుందన్నారు, గ్రామీణ ప్రజల ఉద్యోగ అవకాశాలు కల్పించడం పేదరికం తగ్గించడం ఈ పథకం ద్వారా చెరువులు, కాలువలు పునరుద్ధరించడం రోడ్లు నిర్మించడం చెట్లు నాటడం నీటి సంరక్షణ పనులను కల్పిస్తుందన్నారు, ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతి సెక్రెటరీ యాదయ్య బైకని శివకుమార్ యాదవ్ మాజీ సర్పంచ్ కృష్ణయ్య వార్డ్ మెంబెర్లు సభావాట్ రాజు నాయక్. కుమ్మరి వెంకటేష్ మాకూరి మహేష్ గాదెకాడి కృష్ణయ్య గాదెకాడి యాదగిరి పాల్గొన్నారు,

**ధరిత్రిని కాపాడుకుందాం.. భావితరాలకు పచ్చదనాన్ని అందిద్దాం!**
**సూరారం కాలనీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ భూమి దినోత్సవం**
**ముఖ్య అతిథులుగా హాజరైన పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ ప్రసన్న కుమార్, కోలా రవీందర్**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సూరారం కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రామ) లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమాతను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు ఉద్ఘాటించారు.

ప్లాస్టిక్ రహిత భూమి కావాలి: ప్రొఫెసర్ ప్రసన్న కుమార్

తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్, ప్రముఖ పర్యావరణవేత్త ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. "మనం నివసించాలన్నా, నీరు, నీడ పొందాలన్నా భూమి ఆరోగ్యంగా ఉండాలి. భూమిని మాతృభూమిగా భావించి గౌరవించాలి. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి కలుషితమవుతోంది. భూమిని సారవంతంగా ఉంచుకున్నప్పుడే నాణ్యమైన పంటలు పండుతాయి. భూమాత సంరక్షణే లోకకళ్యాణం" అని విద్యార్థులకు వివరించారు.

ప్రకృతి వ్యవసాయమే ప్రాణాధారం: కోలా రవీందర్

సామాజిక, పర్యావరణవేత్త కోలా రవీందర్ గారు మాట్లాడుతూ..



రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా, పశువుల పేడతో చేసే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్లాస్టిక్ భూమికి క్యాన్సర్ లాంటిదని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు చేతి సంచులు (గుడ్డ సంచులు) వాడేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ప్రతిజ్ఞ.. పాల్గొన్న ఉపాధ్యాయ బృందం

అనంతరం భూమాతను కాపాడుతామని, పర్యావరణాన్ని సంరక్షిస్తామని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, పుణ్యవతి, రవికుమార్, జావిద్, లక్ష్మణ్, హనుమంతరావు, వెంకట్రావు తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పర్యావరణ స్పృహను పెంపొందించడం ద్వారా మాత్రమే మనం భూమిని కాపాడుకోగలమని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

# జనం మెచ్చిన నేత.. సంక్షేమ ప్రదాత: ఎమ్మెల్యే వివేకానంద్‌కు వెల్లువెత్తిన వినతులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర: నియోజకవర్గ ప్రజల ఆశాజ్యోతి, బిఆర్ ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం జనసందోహంగా మారింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

-ప్రజల ముంగిట ప్రజాప్రతినిధి

ఉదయం నుండే ఎమ్మెల్యే కార్యాలయానికి కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించడంతో పాటు, పలు శుభకార్యాలకు, సామాజిక కార్యక్రమాలకు హాజరుకావాలని వివేకానంద్ ని ఆహ్వానించారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధి – సంక్షేమమే లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్



నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రతి కార్యకర్తకు, నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీ పడకుండా నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో సందడి చేసిన నేతలు, అభిమానులు.

వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నుండి వినతుల స్వీకరణ.

ప్రజా సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన.

కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన ఎమ్మెల్యే పలకరింపు.

# వల్లభాయ్ పటేల్ నగర్, అంబేద్కర్ నగర్ వాసులకు ఊరట: మున్సిపల్ కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ వినతి

**- అక్రమ నిర్మాణాల పేరుతో జరిమానాలు వేయడం అన్యాయం.. తక్షణమే ఉపసంహరించుకోవాలి!**
**- కుత్బుల్లాపూర్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సృజనకు విజ్ఞప్తి**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ గళమెత్తారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, అక్రమ జరిమానాలపై బుధవారం ఆయన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన (ఐఏఎస్)లిలి ని కలిసి సమస్యను కూలంకషంగా వివరించారు.

30 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లకు జరిమానాలా?

దాదాపు 30 ఏళ్ల క్రితమే అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు అక్రమ నిర్మాణాలుగా పరిగణిస్తూ మున్సిపల్ సిబ్బంది భారీగా జరిమానాలు విధించడంపై శ్రీశైలం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ నోటీసులను, జరిమానాలను తక్షణమే ఉపసంహరించుకుని బాధితులకు న్యాయం చేయాలని కమిషనర్ మేడమ్‌ను కోరారు. బాధితుల ఆవేదనను సావధానంగా విన్న కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



అభివృద్ధి పనుల టెండర్లపై చర్చ

కేవలం పన్నుల సమస్యే కాకుండా, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిళ్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను కమిషనర్‌కు అందజేశారు. ప్రభుత్వం నుండి మంజూరైన పనులు టెండర్ ప్రక్రియలో ఆగిపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి, పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ వెంకటేష్ కుమార్ కూడా పాల్గొని, అభివృద్ధి పనుల స్థితిగతులపై చర్చించారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆగం పాండు, శ్రీనివాస్ రెడ్డి, నేతలు మోటే శ్రీనివాస యాదవ్, అరువ వెంకట్, సాయికిరణ్, గోపాల్ రెడ్డి, గుమస్తా మధుసూదన్ పాల్గొన్నారు. అలాగే వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, సభ్యులు ఎన్ వి రెడ్డి, కృష్ణ, రాము, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



కుల్కచర్ల, ఎప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): ఉపాధి హామీ కూలీలు ఎండల తీవ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని లాల్ సింగ్ తండా సర్పంచి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కుల్కచర్ల మండలం లాల్ సింగ్ తండాలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ఎండలో పని చేయరాదని సూచించారు. ఎక్కువగా నీటిని తాగడం మంచిదన్నారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, ఆశా కార్యకర్త అంజమ్మ, వార్డు సభ్యులు శివమ్మ, శాంతి, రాజు, కిషన్, రాంచందర్, పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపిన బిజెపి నాయకులు



బాన్సువాడ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర). ఆర్టీసీ కార్మికులకు బుధవారం మద్దతు తెలిపిన బాన్సువాడ బిజెపి నాయకులు కామారెడ్డి జిల్లా బాన్సువాడ లో ఆర్టీసీ జేఏసీ కార్మికుల కు మద్దతు గా బాన్సువాడ భారతీయ జనతా పార్టీ నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, టౌన్ మండల అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, పొతంగల్ మాజీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు ప్రకాష్ పాటిల్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, టౌన్ ఉపాధ్యక్షులు గుడుగుట్ల అనిల్, గోపి, బల్వీర్ సింగ్, నాగరాజు కార్యకర్తలు ఆర్టీసీ సమ్మెకు మద్దతు పలికారు.

## రోగులకు ఫ్రూట్స్ పంపిణి చేసిన అనుచరులు

కల్లూరు,ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ) మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయతీ సర్పంచ్ కిసర నిర్మల,మోహన్ రెడ్డి ల 48వ పెళ్ళి రోజు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. గత 48 ఏళ్లుగా ఒకరికి ఒకరు వెన్ను దన్నుగా నిలుస్తున్నందుకు, వారి జీవిత ప్రయాణంలో గొప్ప భాగస్వాములు గా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి జీవిత ప్రయాణం ఇలాగే మరెన్నో సంవత్సరాల పాటు కొనసాగాలని కోరుకున్నారు. ఈ సందర్బంగా గ్రామ కార్యదర్శి కందాల రాజు, జీపీవో నాగరాజు, ఉప సర్పంచ్ పరిమి కృష్ణ వేణి,వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది గ్రామ సర్పంచ్ కిసర నిర్మల మోహన్ రెడ్డి ల దంపతులకు పెళ్ళి రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిమి భరత్, కోట ఉపేంద్ర ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు రోగులకు ఫ్రూట్స్ పంపిణి చేసారు.

ఈ కార్యక్రమం లో వనమా శ్రీనివాస రావు, అనుచరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు విజయవంతం

## అమరుల స్థూపం వద్ద నివాళులు...



కారేపల్లి,ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు బుధవారం హైదరాబాదులోనీ టీయూజెఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు సుల్తాన్ యాదగిరి నాయకత్వంలో ఎం.వి.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల కళాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఉద్యమ, కళాకారులు ర్యాలీ నిర్వహించి,అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టియుజేఏసీ ప్రధాన కార్యదర్శి రైటర్ సింగర్ అవార్డు గ్రహీత షేక్ ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారులు ఎంతో కష్టపడి తెలంగాణను సాధిస్తే గత పాలకులు ఉద్యమకారుల కనీస అవసరాలను సైతం తీర్చలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాన్ని మరచారని దుయ్యపట్టారు. కెసిఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను తెలంగాణ సాధించడంలో కీలుబొమ్మలుగా వాడుకొని వదిలేసారని అన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ కళాకారులకు 250 గజాల ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మిస్తామనిఉద్యమకారులకు,కళాకారులకు 25 వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని మాట ఇచ్చారని,కానీ నేడు అధికారంలోకి వచ్చిన ఇప్పటికీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని వాపోయారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగులు మీరా,ఫక్రుద్దీన్,బద్రు, ఎల్లంపల్లి బుచ్చయ్య,కళాకారుడు మదర్ తెరిసా అవార్డు గ్రహీత ఆదేర్ల శంకర్రావు,నూకల సత్యనారాయణరెడ్డి,ఉద్యమ నాయకులు అంకం సతీష్,గుంటి శ్రీను,అంజయ్య,కాటూరి శ్రీను,గజ్జల సత్యం,వెంకటేశ్వర్లు,బుజ్జి తదితర కళాకారులు పాల్గొన్నారు.

# సాగులో డ్రోన్ సాయం పై క్షేత్ర సందర్శన



బూర్గంపాడు ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) కృషిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నాడు బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో డ్రోన్ ద్వారా వరి సాగు విధానంలో క్షేత్ర దినోత్సవం జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్,ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.రామ్ గోపాల్ వర్మ విచ్చేశారు. ఈ డ్రోన్ విధానంలో వరి సాగు విధివిధానాలు,వాటి యొక్క ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. అలాగే క్షేత్ర పరిశీలిన కూడా చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.టి భరత్ జిల్లాలోని రైతులు యువతీ యువత ముందుకు వచ్చి ఈ డ్రోన్ ద్వారా వరి సాగు విధానాన్ని తెలుసుకొని విస్తృత స్థాయిలో చేపట్టాలి అలాగే మంచి ఫలితాన్ని పొందాలని తోటి రైతులకు విన్నవించారు. అలాగే మణుగూరు డివిజనల్ ఏడి తాతారావు,సోంపల్లి గ్రామంలోని రైతు నర్సిరెడ్డి ఈ డ్రోన్ ద్వారా వరి సాగు విధానం గురించి తెలుసుకుని వారిని అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో తోటి రైతుల యొక్క అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ డ్రోన్ విధానంలో వరి సాగు యొక్క కష్టనష్టాల గురించి లాభాల గురించి ఉపయోగాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకోనీ ఆ తరువాత శాస్త్రవేత్తల బృందం,అధికారుల బృందం రైతులతో కలిసి క్షేత్ర సందర్శన జరిపి పరిశీలించి వాటి యొక్క వివరాలను నమోదు చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.రఘువీర్,డా.శరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రత బి శివ అలాగే 50 మంది రైతులు పాల్గొన్నారు.

# షాబాద్ లో మహనీయుల జాతర గోడ పత్రిక ఆవిష్కరణ

### - 30 న జరిగే సభను విజయవంతం చేద్దాం:ఆంజనేయులు



షాబాద్, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) : షాబాద్ మండల కేంద్రంలో మహనీయుల జాతర సందర్భంగా మహనీయుల జాతర కమిటీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు, యువత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు గోడ పత్రికను ఆవిష్కరించి, మహనీయుల సేవలను స్మరించుకున్నారు. వారి జీవితాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, ఈ నెల 30 తేదీన జరిగే ఈ జాతర ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండాల అశోక్, చేర్లగూడ సర్పంచ్ పెంటయ్య,సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, అక్తర్ పాషా,రమేష్ యాదవ్,రాపోలు నర్సింలు, నవీన్,రాము,అష్మత్ పాషా,ప్రభాకర్,నరేందర్,బొబ్బిలిగామ మల్లేష్,జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం...

విజన్ ఆంధ్ర అక్కన్నపేట ఏప్రిల్ 22 : దేశ ప్రధానమంత్రి గారిని ఉగ్రవాది అని అనడం ఖర్గే అహంకారానికి నిదర్శనం అక్కన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రి గౌ.శ్రీ. నరేంద్ర మోదీ గారిని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు టెర్రరిస్టు అని అనడం సిగ్గుచేటు, ఖర్గే వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ అక్కన్నపేట మండల శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ ప్రధానిని గౌరవించలేని కాంగ్రెస్ నాయకులు దేశ ప్రజలను, భారత రాజ్యాంగాన్ని ఏవిధంగా గౌరవిస్తారో దేశ ప్రజలు ఆలోచించాలని కోరుతున్నాము. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలతో ఎన్నికైన దేశ ప్రధానిని టెర్రరిస్టుగా సంబోధిస్తూ, అవహేళన చేయడం రాజ్యాంగ విలువలను దెబ్బ తీసే విధంగా ఉన్నాయని, ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఖర్గే పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ ఎప్పుడూ చూసిన రాజ్యాంగ పుస్తకం చేతిలో పట్టుకుని తిరుగుతారు కానీ ప్రధానమంత్రి గౌరవించే గుణం లేని నాయకులు కాంగ్రెస్ పార్టీ వారని విమర్శించారు. వెంటనే ఖర్గే వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము. లేకపోతే రాబోయే కాలంలో దేశ ప్రజలే ఖర్గే కు , కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చేబుతరన్నారని తెలిపారు.





## బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

### - రాంగ్ రూటె ప్రమాదానికి కారణం

షాబాద్,ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) షాబాద్ మండల పరిధిలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. షాబాద్--సంకేపల్లి గూడెం మార్గంలో చేవెళ్ల వైపు నుంచి షాబాద్‌కు వస్తున్న రెండు బైకులను, రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు బైకులపై ఉన్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరికి తొడ ఎముక విరగగా, మరో ఇద్దరికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారు కేశగూడెం, ఎల్గొండగూడెం, కొందుర్గు గ్రామాలకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి

### ఆర్ అండ్ బి అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సమీక్ష...

నిజామాబాద్ ఏప్రిల్22:( విజన్ ఆంధ్ర) రోడ్లు భవనాల శాఖ పరిధిలో కొనసాగుతున్న పనుల్లో నాణ్యతతో చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీయూ ఎఫ్ఐడీఎస్ కింద గతంలో రూ. 60 కోట్ల నిధులతో చేపట్టిన పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఎల్లమ్మ గుట్టలోని సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో గల బ్రిడ్జి పనుల పురోగతిని తెలుసుకున్నారు. నగరంలోని ఆర్య నగర్ రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి దత్తాత్రేయ మందిరం వరకు రూ.22 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు పనులపై సమీక్షించారు అలాగే నూతనంగా నగరంలో చేపట్టే బీటీ రోడ్ల ప్రతిపాదనలను తయారు చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా పనులు చేపట్టాలని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ఈ ఈ అజ్మీరా రాము, డిఈ ప్రవీణ్, ఏఈ సాయికుమార్ గుప్తా పాల్గొన్నారు.

# గ్లాస్ అల్మిరాల వితరణ

కొడంగల్, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ): ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ కు నారాయణ పేటకు చెందిన వగ్గు ఉమాదేవి ఆమె భర్త, కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కీ. శే. డా. వగ్గు మనోహర్ గౌడ్ గారి జ్ఞాపకార్థం 2 లక్షల విలువ గల 15 గ్లాస్ అల్మిరాలను ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కీ. శే. డా. మనోహర్ గౌడ్ గారు 2010 నుండి 2015 వరకు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేసారని, అతను అహర్నిశలు పనిచేసి కళాశాల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. బహూకరించిన అల్మిరాలు, లైబ్రరీ మరియు ప్రయోగశాలల అవసరాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. దాతల ధాతృత్వాన్ని, సేవాతత్పరతను కొనియాడారు. ప్రిన్సిపాల్ దాతలు వగ్గు ఉమా దేవి, ఎన్. ఆర్. ఐ. వగ్గు కిరీటి లకు ధన్యవాదాలు తెలిపారు. వగ్గు ఉమా దేవి మాట్లాడుతూ మనోహర్ గౌడ్ గారు ప్రాంతీయ అభిమానంతో కళాశాల అభివృద్ధికై విశేషంగా కృషి చేసేవారని, కళాశాల ఈ స్థాయికి చేరుకోవడం గర్వకారణమన్నారు. 2025-26 విద్యా సవత్సరం నుండి పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులో "డా. మనోహర్ గౌడ్ మెమోరియల్



అవార్డును" 5వేల నగదు మరియు బంగారు పథకంతో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. కళాశాలకు ఈ విధంగా సహాయం చేసే గొప్ప అవకాశం రావడం తమ అదృష్టమన్నారు. అనంతరం వగ్గు ఉమాదేవిని ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది శాలువాతో సత్కరించి మొమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో వగ్గు భాస్కర్ గౌడ్, పి. సతీష్ గౌడ్, వగ్గు నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, సి. ఎస్. ఆర్ కోఆర్డినేటర్ టి. రాంబాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీతలను సన్మానించిన టీపీసీసీ నాతరి స్వామి

బెల్లంపల్లి ఏప్రిల్ 22 విజన్ఆంధ్ర : దళిత అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అందజేసిన దళిత రత్న అవార్డు గ్రహీతలను టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో దళితులపై జరుగుతున్న అగ్రకుల దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలు, మానభంగాలు, బహిష్కరణలను ఖండిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి ఆత్మగౌరవం కోసం కృషి చేస్తున్న నాయకులను ప్రభుత్వం గుర్తించడం అభినందనీయమని అన్నారు.
డా. బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళావేదికలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ చేతుల మీదుగా ఈ అవార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ అవార్డును అందుకున్న బెల్లంపల్లి పట్టణానికి



చెందిన గంగారపు రమేష్ (రాష్ట్ర ఉపాధ్యక్షుడు), అకునూరి రాజ్‌కుమార్ (జిల్లా ప్రధాన కార్యదర్శి), ఎనగందుల శివాజీ (పట్టణ అధ్యక్షుడు), అలాగే చాకేపల్లి గ్రామానికి చెందిన గోగర్ల శేఖర్ (జిల్లా అధికార ప్రతినిధి)లను ప్రత్యేకంగా అభినందించారు.
ఈ అవార్డు వారి బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో కూడా అణగారిన వర్గాల కోసం కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని నాతరి స్వామి ఆకాంక్షించారు.

## తాటిగూడ గ్రామపంచాయతీ నర్సరీని సందర్శించిన డి.ఎల్.పి.ఓ

బెల్లంపల్లి ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర : కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీని జిల్లా స్థాయి పంచాయతీ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న పూల, పండ్లు నీడనిచ్చే వివిధ రకాల మొక్కల ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలించారు. నర్సరీ నిర్వహణ విధానం, నీటి సరఫరా, ఎరువుల వినియోగంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాటడానికి అవసరమైన నాణ్యమైన మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. మొక్కల ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, రికార్డులను (రిజిస్టర్లు) సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడావి వెంకటేష్, డి.ఎల్.పి.ఓ సతీష్ కుమార్, ఎంపీఓ షేక్ సప్దర్ అలీ, కార్యదర్శి మౌనిక, నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

# హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలి - సీపీఐ(ఎం)

కారేపల్లి, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు.బుధవారం కారేపల్లి మండలం మాదారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం),రైతు సంఘం నాయకులు సందర్శించారు.రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులు హమాలీలకు చెల్లిస్తున్న రేట్లు, కాంటాలు,లారీల కొరతపై ఆరా తీశారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకుల మాట్లాడుతూ కారేపల్లి మండలంలో 10 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేసినా ప్రభుత్వం కేవలం మారుమూల ఉన్న మాధారం ఒక కొనుగోలు కేంద్రాన్ని మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. రేలకాయలపల్లి, చీమలపాడు, తొడితలగూడెం,పోలంపల్లి,కమలాపురం రైతులు మాధారం కేంద్రాన్ని వచ్చి మొక్కజొన్న అమ్మకాలు సాగించటం అవస్థలతో కూడుకున్నదన్నారు. దీంతో ప్రయివేటు వ్యాపారస్తులకు అరకొరగా అమ్ముకుంటూ ఆర్థికంగా తీవ్రనష్టపోతున్నారన్నారు. మొక్కజొన్న దిగుబడి 50 క్వింటాళ్లు ఉండగా కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గిరిజనేత ప్రాంతాలలో యథేచ్ఛగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కారేపల్లి



మండలంలో కేవలం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయటం వివక్షతకు నిదర్శనమన్నారు. మారుమూల గ్రామాల నుండి మాదారం కేంద్రాన్ని మొక్కజొన్న తీసుకరావటం ఖర్చు కూడుకున్నదన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో హమాలీ ఖర్చు రైతులే భరించాల్సి వస్తుందన్నారు.హమాలీ ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు.లారీ మాముళ్ల పేరుతోబస్తాకు రూ.5 ఇవ్వాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారన్నారు.లారీ దిగుమతికి వారం రోజులు పడుతుందని వెయిటింగ్ ఖర్చుల కోసం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.

గోదాంల వద్ద కూడా వసూళ్ల పర్వం సాగుతుందని ఇది అంతా రైతులే భరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఖర్చులు అన్ని చూచుకుంటే ప్రయివేటే నయమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు.రైతుకు ఎలాంటి ఖర్చులు లేకుండా మొక్కజొన్న, ధాన్యంను ప్రభుత్వం తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.రైతు సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో జరిపే పోరాటాలకు మద్దతు ఇవ్వాలని రైతులను కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మొక్కజొన్న రైతుల ఇబ్బంది,అదనపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రాధాన్యత గురించి కొనుగోలు కేంద్ర వద్ద నుండి రైతుల సమక్షంలో సీపీఐ(ఎం) నాయకులు ఫోన్ ద్వారా వివరించారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే అదనపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ప్రస్తుతం నడుస్తున్న కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బంది జరగకుండా చూడాలని సీఈవో బల్లు హనుమంతరావు కు సూచించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం,వజ్జా రామారావు, నాయకులకు తుమోజు రామ్మూర్తి, పాపినేని నాగేశ్వర రావు,పొట్లకాయల రమేష్, నాగేశ్వరరావు,రజిని,కిలారి అప్పారావు, బానోత్ సీతారాములు,ధర్మసోత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి రైల్వే స్టేషన్ సమస్యలపై రైల్వే డి ఆర్ ఎం కు కౌన్సిలర్ రాజం వినతిపత్రం



బెల్లంపల్లి, ఏప్రిల్ 22 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ కాంపెల్లి రాజం రైల్వే అధికారులకు పలు కీలక సమస్యలపై సికింద్రాబాద్ రైల్వే డి ఆర్ ఎం కు వినతి పత్రం అందచేశారు. బెల్లంపల్లి లోని అన్ని మండలాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్టేషన్ ప్రాంగణంలో ఎటిఎం యంత్రం ఏర్పాటు చేయడంతో పాటు, అమృత భారత్ పథకంలో భాగంగా 2వ నంబర్ ప్లాట్‌ఫారమ్ వద్ద ఉన్న మరుగుదొడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే కాలనీ, రడగంబల బస్తీ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల కొరతతో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సిబ్బందిని పెంచి పరిశుభ్రతను మెరుగుపరచాలని కోరారు.

తిరుపతి వైపు వెళ్లే రైళ్లకు స్టేషన్‌లో ఆగే సౌకర్యం లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, కేరళ ఎక్స్‌ప్రెస్, దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇక 1వ ప్లాట్‌ఫారమ్ వద్ద ఉన్న వికలాంగుల స్నానాల గది మూసివేయబడిందని, దానిని వెంటనే ప్రారంభించి వికలాంగుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కౌన్సిలర్ రాజం విజ్ఞప్తి చేశారు.

## ఇల్లందు బస్ డిపో లో ఆర్టీసీ జేఏసి సమ్మె విజయవంతం..

ఇల్లందు, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని ఆర్టీసీ కార్మికులు బస్ డిపో వద్ద మోహరించి సమ్మె విజయ వంతం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇల్లందు సి ఐ టీ సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ జేఏసి సమ్మె నేపథ్యంలో టెంట్ వేసి సమ్మె ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జరిగిన సభలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టో హామీ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,యూనియన్లను పునరుద్ధరించాలని, యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, పీ ఆర్సీ 2021,2025 చెల్లించాలని,2017 వేతన సవరణ ఏరియర్స్ చెల్లించాలని, ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ కి ఇవ్వాలని తదితర డిమాండ్స్



తో తల పెట్టిన జే ఏ సీ సమ్మె కు స్టాఫ్ అండ్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు సంపూర్ణంగా మద్దతు ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ వీలు జే ఏ సీ కన్వీనర్ ఖలీల్ పాషా , కో కన్వీనర్ డీ అంజయ్య, పీ ఎల్ రావు, పీ కృష్ణ, సైదమ్మ ఉపేంద్ర హనుమ మహేశ్వరి తాళ్లూరి కృష్ణ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయాలి

### – ఎన్ఎస్‌యూఐ హెచ్చరిక

చేవెళ్ల,ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం సరైంది కాదని, వెంటనే నిలిపివేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు హెచ్చరించారు. ఎన్ఎస్యుఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కర్ణాకర్ గౌడ్ ఆదేశాల మేరకు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య టెక్నో పాఠశాలను ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముందస్తు ప్రవేశాలు జరుగుతున్నట్లు గుర్తించి వాటిని వెంటనే ఆపివేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం ఎన్ఎస్‌యూఐ జనరల్ సెక్రెటరీ బి. శాంసోన్, మండల కమిటీ సభ్యులు ఎండి సమీరుద్దీన్, ఇర్ఫాన్ లు మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోని విద్యాసంస్థలపై అధికారాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం జూన్ నెల నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా



ముందస్తు ప్రవేశాలు చేపట్టినా ఎన్ఎస్‌యూఐ తరఫున తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాబోయే 2026--27 విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్యామ్, సాయి, రాహుల్, ఎండి జావీద్, అజర్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కూలిందన్న సీఎం

**కాన్వాయ్‌లో ఎలా వెళ్లిండో చెప్పాలే !**

**--కేసీఆర్‌ను తిట్టించడానికే..**

**కాటారంలో కాంగ్రెస్ మీటింగ్ !**

**- ముఖ్యమంత్రి వస్తే ఈ ప్రాంతానికి అభివృద్ధి బాటలు పడాలే**

**- ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలే**

**- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన నాయకుడు కేసీఆర్**

**- ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



కాటారం, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణాకు వ్యతిరేకంగా ఆనాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి నీ వల్లెంకుంటకు తీసుకువచ్చి తెలంగాణ వాదాన్ని అణిచివేయాలని చూసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్, ఈనాడు తెలంగాణ ఉద్యమనేత మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టించడానికే కాటారం మండలంలో మీటింగ్ పెట్టి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్తూరిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో నిర్వహించిన మీటింగ్ కాటారం మండలాన్నే అపవిత్రం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి గొంతెత్తి మాట్లాడితే గొప్పగా అనుకుంటున్నాడేమో గానీ ఆయన మాటలు విని సమాజమంతా అసహ్యించుకుందని అన్నారు. ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోయి మురికినోటితో నోటికచ్చినట్లు మాట్లాడాడని, ఒక మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌ను చెట్టుకు కట్టేసి కొడుతామంటాడా అని అగ్రహం వ్యక్తం చేశారు. అంటే కావాలనే కేసీఆర్‌ను తిట్టించడం కోసమే ఇక్కడ మీటింగ్ పెట్టించాడని అర్థం అవుతుందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సన్నబియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సీడీల గురించి చెప్పి భుజాలు చరుసుకుంటున్నారని, ఇచ్చిన హామీలెన్నీ అనే విషయాన్ని ఎందుకు చెప్పడం లేదన్నారు. మానీఫెస్టో కమిటి చైర్మన్ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ రాసిన గ్యారెంటీ కార్డులో నాలుగే ఉన్నయా అని ప్రశ్నించారు. అందులో మహిళలకు 2500, రైతులకు 15వేలు, కౌలు రైతులకు ఇస్తమన్నవి ఏవీ అని ప్రశ్నించారు. పింఛన్‌లు పెంచకుండా, యువ వికాసం అమలు చేయకుండా గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మూడేళ్లకు 3 వేల ఇండ్లు మంజూరీ చేసిండ్లవి అవి కూడా ఎన్నికలు వచ్చిన సమయంలోనే ఓట్ల కోసం ఇచ్చారని ఆయన విమర్శించారు. ఆనాడు వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తమని తొమ్మిది వందల రోజులైనా అమలు చేయకపోవడం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. సీమాంధ్రుల చెప్పులు మోసిన రేవంత్‌రెడ్డి ఆనాడు ఉద్యమకారులను తుపాకులతో బెదిరించిన విషయం ఇంకా ప్రజలు మర్చిపోలేదన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని ఇక పనికిరాదని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి నిన్న అదే కాళేశ్వరం మీదుగా కాన్వాయ్‌లో ఎలా వెళ్లావని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి ఒక ప్రాంతంలో జరిగే మీటింగ్ కు వస్తున్నాడంటే ఆ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడమో, ఏదైనా పరిశ్రమను తీసుకురావడమో జరుగుతుంది కానీ ఇక్కడ మాత్రం కేవలం కేసీఆర్‌ను తిట్టాలనే ఆలోచనతోనే మిటింగ్ పెట్టారన్నారు. నియోజకవర్గంలో అనేక వనరులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని పరిశ్రమనో, ఫ్యాక్టరీనో తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకశాలు కల్పించాలని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 40 ఏండ్లుగా దుద్దిళ్ల కుటుంబానికి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే ఏ ఒక్కరికి మేలు చేయకపోగా వేలకోట్ల రూపాయలు సంపాధించుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈనాడు చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తామని సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆరెంద మానేరుపై వంతెనకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశాడని, ఆ పనులు ఎన్నడు మొదలు పెడుతారో అర్థం కావడం లేదన్నారు. డిసెంబర్ 04 న మంథని గోదావరినదిపై వంతెనకు శిలాఫలకం వేశాడని, కానీ రెండున్నర ఏండ్ల క్రితమే వంతెనకు జీఓ వచ్చిందని, శిలాఫలకం వేసి ఏడాది కాబోతుందని ఇప్పటి వరకు పనులు ముందుకు సాగడంలేదన్నారు. కేవలం అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం చేస్తారని, అబద్ధాలతోనే అధికారం నడిపిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. మీ మాటలు, మీ అబద్దాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, సీ ఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ లు ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాటారం మండలం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి జోడు శ్రీనివాస్, సర్పంచ్ పంతకాని సడవలి, మానేం రాజబాబు , ఊర వెంకటేశ్వరరావు, జక్కు రాకేష్, లింగంపల్లి శ్రీనివాసరావు, కేదారి గీత, శ్రీపతి బాపు, సల్మాన్ ఖాన్, అలీం ఖాన్, మార్క రాము గౌడ్, ఆతుకూరి బాలరాజు, సబ్ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనుల పై సమీక్షా సమావేశం నిర్వహించిన సబ్ కలెక్టర్

కల్లూరు,ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ) ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ పనులు పరిశీలన కార్యక్రమం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తో పాటు పాల్గొన్న సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్. అనంతరం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం లో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ

ల్యాండ్ ఎక్విజేషన్ కు డబ్బులు ఇచ్చి ఉన్నాం అయిన పనులు ఆలస్యం అవడానికి కారణాలు అధికారుల ద్వారా తెలుసు కున్నారు,అధికారుల నిర్లక్ష్యం వీడి ల్యాండ్ ఎక్విజేషన్ లో ఏమైనా ఇబ్బందులు ఉంటే భూమి హక్కు దారులతో మాట్లాడి సమస్య పరిస్కారించాలని అధికారులకు చూసించారు. సీతారామ ప్రాజెక్ట్ అధి కారులకు పనుల పురోగతితో పాటుగా పనులను వేగవంతంగా చేయడంతో పాటు నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.



అలాగే శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ, పనుల నాణ్యతను మెరుగుపరచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, నిర్దేశిత లక్ష్యాలను సమయానికి సాధించాలని స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్. ఈ కార్యక్రమం లో సీతారామ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయాలి: ఎన్ఎస్‌యూఐ హెచ్చరిక

చేవెళ్ల,ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం సరైంది కాదని, వెంటనే నిలిపివేయాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు హెచ్చరించారు. ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కర్ణాకర్ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య టెక్నో పాఠశాలను ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముందస్తు ప్రవేశాలు జరుగుతున్నట్లు గుర్తించి వాటిని వెంటనే ఆపివేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం ఎన్ఎస్‌యూఐ జనరల్ సెక్రెటరీ బి. శాంసోన్, మండల కమిటీ సభ్యులు ఎండి సమీరుద్దీన్, ఇర్ఫాన్ లు మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాలను పట్టించుకోని విద్యాసంస్థలపై అధికారాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం జూన్ నెల నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా ముందస్తు ప్రవేశాలు చేపట్టినా ఎన్ఎస్‌యూఐ తరఫున తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాబోయే 2026--27 విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్యామ్, సాయి, రాహుల్, ఎండి జావీద్, అజర్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లి పోలీసుల గాలానికి చిక్కిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా!

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): నగర శివార్లలో వరుస దొంగతనాలతో హడలెత్తిస్తున్న ముఠా గుట్టును బాచుపల్లి పోలీసులు రట్టు చేశారు. రాత్రి సమయాల్లో ఇళ్ల తాళాలు పగలగొట్టడమే కాకుండా, వాహన చోరీలకు పాల్పడుతున్న ఒక నిందితుడితో పాటు, నేర ప్రవృత్తికి అలవాటు పడిన ఇద్దరు మైనర్లను (చట్టంతో సంఘర్షణ కలిగిన బాలురు) పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుండి చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

**నేరాల చిట్టా ఇదే..**

బాచుపల్లి డి.ఐ నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు కేవలం బాచుపల్లి పరిధిలోనే కాకుండా, నగరంలోని వివిధ ప్రాంతాల్లో వరుస నేరాలకు పాల్పడినట్లు తేలింది. వీరిపై నమోదైన ప్రధాన కేసులు: బాచుపల్లి పిఎస్: ఇళ్ల దొంగతనాలు, వాహన చోరీలకు సంబంధించి రెండు కేసులు (జతీ.చీశీ. 386/2026, 277/2026),

జగద్గిరిగుట్ట పిఎస్: చోరీ కేసు (జతీ.చీశీ. 570/2026), బోయినపల్లి పిఎస్: ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడిన కేసు (జతీ.చీశీ. 222/2026).

## ఒకరి అరెస్ట్.. అదుపులో ఇద్దరు మైనర్లు : భారీగా ఆటోమొబైల్ సొత్తు స్వాధీనం

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

పోలీసుల తనిఖీల్లో నిందితుల వద్ద నుండి కింది వాహనాలను రికవరీ చేశారు: 1.హోండా యాక్టివా (No. TS 08 HX 0118), 2.ఆటో రిక్షా (No. TS 34 TA 4070),

**కటకటాల్లోకి నిందితులు:**

పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ నేరాల్లో పాలుపంచుకున్న ఇద్దరు బాలురను చట్టపరమైన నిబంధనల ప్రకారం పర్యవేక్షణ గృహమునకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

పోలీసుల విజ్ఞప్తి: రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, వాహనాలకు సరైన లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని బాచుపల్లి పోలీసులు ప్రజలకు సూచించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# మెప్మా ఆధ్వర్యంలో ఉద్యమ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఏప్రిల్ 22 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలక సంఘ మెప్మా ఆధ్వర్యంలో మహిళా వ్యాపార వేత్తలకు ఆర్పిలకు ఉద్యమ రిజిస్ట్రేషన్ ఫైన శిక్షణ కార్యక్రమంను కమీషనర్ మల్లికార్జున్ గౌడ్ ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారీ పద్మ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ హన్మంతరెడ్డి హాజరయ్యారు. మహిళా సంఘాల ప్రతినిధులకు ఉద్యమ రిజిస్ట్రేషన్ ఆవిష్యతఫై సూచనలు జారిచేసినారు. అనంతరం మాట్లాడుతూ

చైర్ పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ఆర్పిలకు ప్రతి మహిళా వ్యాపారం ప్రారంభించేలా ప్రతి ఒక్కరికి వివిధ లోన్ లను విరివిగా అందించాలని సూచనలు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజాప్రభుత్వం తోడ్పాటునిస్తుందని తెలిపారు. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఈడిసి మేనేజర్ శిరీష,సిబ్బంది రాజు, మెప్మా ఆర్పీ లు పట్టణ సమాఖ్య ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో రైతు భరోసా ఇవ్వాలి : రైతుల డిమాండ్

ఉట్నూర్, ఏప్రిల్ 22, (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసాను ఒకేసారి చెల్లించాలని ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో సమావేశం నిర్వహించి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు సభలో ప్రతి రైతుకు ఐదు ఎకరాల వరకు ఒకేసారి రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చారని రైతులు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం బ్యాంక్ ఖాతాల్లో పరిశీలించగా ప్రతి రైతుకు కేవలం రూ.6,000 మాత్రమే జమ కావడం పట్ల తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని రైతులు ఆరోపించారు. రైతులను ఇంకా ఎంతకాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే పూర్తి మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

రాబోయే రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంద్ర జైవంత్ రావు మాజీ ఎంపిపీ ఉట్నూర్, సిడాం సోనేరావు పటేల్, పంద్ర మాణిక్ రావు, ఆత్రం భగవంత్ రావు, సిడాం రాంషా, పంద్ర అనంద్ రావు, పెందుర్ త్రిమూర్తి, పంద్ర జలింషా, మరప జాకు, సుదర్శన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాధికారి సయ్యద్. అక్బర్ ఘనంగా ఉద్యోగ విరమణ కార్యక్రమం

శంకర్ పల్లి, ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ): బుధవారం రోజున మండల విద్యాధికారి ఉద్యోగ విరమణ కార్యక్రమం బద్దం సురేందర్ రెడ్డి గార్డెన్ జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం. ప్రసాద్ , స్థానిక శాసన సభ్యులు, కాలే. యాదయ్య, మరియు జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు హాజరయ్యారు.

శంకర్ పల్లి మండలంలో 2015 జులై 10 న జన్వాడ గజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి బాధ్యతలు చేపట్టి, మండల విధాధికారి గా అదనపు బాధ్యతలు చేపట్టి సుదీర్ఘంగా అధికార విధులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు.

స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ మండల విద్యాధికారి అక్బర్ ఎస్ గి టి గా 1989 సెలెక్ట్ అయి నేటికీ 41 సంవత్సరాలు పూర్తి చేశారని కొనియాడారు. జిల్లా విద్యాధికారి శు



శింద్ర రావు మాట్లాడుతూ అక్బర్ పదవి విరమణ తర్వాత తన శేష జీవితం సుఖంగా-ఆరోగ్యంగా ఉండాలని, పదవి విరమణ శుభాకాంక్షలు తెలియచేశారు. మండల టి ఆర్ ఎస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్ పి పి చిన్న నర్సింలు, మాజీ సర్పంచ్ పొడుగు, శ్రీను పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎమ్ ఈ లు బాలానగర్ ఎమ్ ఈ ఓ హరిశచ్చందర్ నాయక్, కొత్తూరు విద్యాధికారి వెంకట్ రెడ్డి మాజీ మండల విద్యాధికారులు వెంకటయ్య, విజయ్ కుమార్, ష్టానిక రావుల పల్లి కళాన్ గజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు జయ సింహ రెడ్డి ,అమ్డాపూర్ ప్రధాన ఉపాధ్యాయులు రేణుకా గ, ఎల్ ఎఫ్ ఎల్ ప్రధాన ఉపాధ్యాయులు అరుణ్ సార్, ఎస్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పోచన్న, టి పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, సి పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్. డి. తాహెర్ అలి, చేవెళ్ల పి ఆర్ టి యు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి దయానంద్, రాజా శేఖర్, శేరిలింగంపల్లి పి ఆర్ టి యు అధ్యక్షులు హన్మంత్,ఆపస్ మండల అధ్యక్షులు ఎమ్. శ్రీనివాస్,విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీశైలం, అశ్రాఫ్, వెంకటయ్య, మండల, జిల్లా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియా, ప్రమోదిని, అర్చన, లలిత,రాము శర్మ, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వ్యాఖ్యతలు ఆశీర్వాదం మొదలగు వారు పాల్గొన్నారు

## పట్టణం లో ప్రధాన రహదారి వెంట ఆక్రమణలు తొలిగించాలి



కల్లూరు,ఏప్రిల్ 22(విజన్ ఆంధ్ర ) మునిసిపాలిటీ లో ప్రధాన రహదారి వెంట డ్రైన్ దాటి రోడ్డు మీదికి ఏర్పాటు చేసిన రేకుల షేడ్స్, తోపుడు బండ్లు, ప్రచార బోర్డ్ లను తొలగించి పాదాచారులకు,వాహన దారులకు ఇబ్బంది కలగ కుండా చూడాలని దుకాణ యజమానులకు టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ ఆదేశాలు జారీ చేసారు.

ఈ కార్యక్రమం లో మున్సిపల్ మేనేజర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ పట్టణం లో 200 మంది షాప్ యజమానులకు ఈ విషయం నోటీస్ ఇవ్వటం ద్వారా తెలియ చేయటం జరిగిందని,నోటీస్ అందిన 7 రోజుల్లో స్వయంగా ఆక్రమణలను తొలగించుకొని ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.అలాగే ప్రకటనల బోర్డు లకు అనుమతి తీసుకోవాలని లేని యెడల మున్సిపాల్టీ సిబ్బంది చే వాటిని తొలగించి జరిమానా విధించడం తో పాటు మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకో బడతాయి అని అయన తెలిపారు.

ఈ కార్యక్రమం లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బొలెరోలో అక్రమంగా పశువుల రవాణా

### - వాహనం స్వాధీనం, ఇద్దరు అరెస్ట్

తాళ్ళగురిజాల, ఏప్రిల్ 22 తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలో పశువుల అక్రమ రవాణా . బుధవారం ఉదయం పోచమ్మ గద్ద వద్ద గురజాల పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా అతివేగంతో వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 7 ఆవులు, 1 కోడెదూడను కిక్కిరిసేలా బంధించి, త్రాగునీరు, గడ్డి వంటి కనీస సౌకర్యాలు లేకుండా అమానుషంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.

డ్రైవర్‌ను విచారించగా అతను రామటెంకి పరమేష్‌గా చెప్పగా, అతనితో పాటు పెద్దపల్లి ప్రాంతానికి చెందిన గౌస్ ఖాన్ కలిసి ఈ పశువులను చింతలమానపల్లి సంతలో కొనుగోలు చేసి, సిద్దిపేట ప్రాంతానికి తరలిస్తున్నట్లు వెల్లడించారు. దీనితో పోలీసులు వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పశువులను సమీప గోశాలకు తరలించారు. నిందితులైన ఇద్దరిని అరెస్ట్ చేసి, గోవుల వధ నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తాళ్ల గురజాల ఎస్సై

## కాళేశ్వరం విషయంలో కేసీఆర్, హరీష్ రావులకు హైకోర్టులో ఊరట

### -ఇది తెలంగాణ ప్రజల విజయం

### - గజ్వేల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్



గజ్వేల్, 22 ఏప్రిల్ 2026 (విజన్ ఆంధ్ర) : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు గౌరవ హైకోర్టులో ఊరట లభించడం పట్ల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విజయం కేవలం పార్టీది మాత్రమే కాదని, మొత్తం తెలంగాణ ప్రజల విజయమని అభివర్ణించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై స్పందించిన హైకోర్టు, ఈ నివేదిక ఆధారంగా ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. పీసీ ఘోష్ కమిషన్ తన విచారణలో ఎలాంటి కనీస నిబంధనలు పాటించలేదని ఆయన విమర్శించారు. 2025 జూలైలో ప్రభుత్వం సమర్పించిన ఈ రిపోర్ట్ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లేందుకే కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజకీయ కక్షతో ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సత్యం ఎప్పుడూ జయిస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ సాధించిన ప్రగతిని ఎవరూ చెరిపివేయలేరన్నారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### - గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు బిఆర్ఎస్ సంఘీభావం

### - కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదుల మీద రాజ్యమేలుతోంది

### - వంటేరు ప్రతాప్ రెడ్డి

గజ్వేల్, 22 ఏప్రిల్ 2026 (విజన్ ఆంధ్ర) : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్సు డిపో వద్ద సమ్మె నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులకు ఆయన బిఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, వేతన సవరణ చేస్తామని మరియు రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందిస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని, మహాలక్ష్మి పథకం (ఉచిత బస్సు) ద్వారా కార్మికులు కెపాసిటీకి మించి ప్రయాణికులను చేరవేస్తూ ఒత్తిడికి గురవుతున్నారని, అయినా ప్రభుత్వం వారి శ్రమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గారు చర్చల పేరుతో కాలయాపన చేశారే తప్ప కార్మికులకు చేసిందేమీ లేదని, ఇది ఆర్టీసీ కార్మికులను నమ్మించి మోసం చేయడమేనని విమర్శించారు. సమ్మెను నీరుగార్చడానికి ప్రభుత్వం ప్రైవేట్ బస్సులను నడపడం మానుకోవాలని, అనుభవం లేని డ్రైవర్ల వల్ల ప్రమాదాలు జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు కూడా సమ్మెకు సహకరించాలని కోరారు.



ప్రయాణికుల జీవితాల్లో వెలుగులు నింపే ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో ఈ రాక్షస కాంగ్రెస్ ప్రభుత్వం చీకట్లు నింపుతోంది. బిఆర్ఎస్ పార్టీ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం.సి. రాజమౌళి, మాదాసు శ్రీనివాస్, నవాజ్ మీరా, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, మన్నే రూప వెంకటేష్, కప్ప మమత పోచయ్య, కనకసేన, కోట బాబు, అత్తెలి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, పంగా మల్లేశం, మంగమ్మ రామచంద్రం, కృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్, రహీం, మల్లేశం, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల దేవేందర్, పుల్ల బీరయ్య, ఉమర్, హనుమంత్ రెడ్డి, స్వామి చారి, శివ మరియు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# ధరిత్రిని కాపాడుకుందాం.. భావి తరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం!

### కుత్బుల్లాపూర్ లో ఘనంగా 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'.. చెరువుల ఆక్రమణలపై ఆందోళన

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22: (విజన్ ఆంధ్ర); పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్య కోరల్లో చిక్కుకున్న భూగోళాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో ఉండాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని, జాగృతి సొసైటీ లీగల్ సెల్, వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలు శివ పార్వతి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ పరిధిలో పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిపేట రవీందర్, పుప్పాల భాస్కర్, కోలా రవీందర్ ముదిరాజ్ హాజరై ప్రసంగించారు.

అంతరించిపోతున్న జలవనరులు – ఆందోళనలో పర్యావరణ వేత్తలు

ఈ సందర్భంగా నందిపేట రవీందర్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్, గాజులరామారం పరిధిలోని చారిత్రాత్మక చెరువుల దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

కాముని చెరువు, ఫాక్స్ సాగర్, రంగధాముని చెరువు, అంబీర్ చెరువు వంటి జలవనరులు ఆక్రమణలకు గురై కనుమరుగవుతున్నాయని



ఆయన ఆవేదన చెందారు.

చెరువుల రక్షణ కోసం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

భూమిని ప్రేమిద్దాం – నీటిని ఆదా చేద్దాం

అనంతరం పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, భూగర్భ జలమట్టం దారుణంగా పడిపోతోందని హెచ్చరించారు. ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని, నీటి వృధాను అరికట్టడం ద్వారానే మనం భూమిని ప్రేమించిన వారమవుతామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం అదేవిధంగా కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, పర్యావరణ హితమైన జీవనశైలి అవశ్యకతను వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పునశ్శ్రీకరణ (=వ-ఎఎశ్రీవ) పద్ధతులను అవలంబించాలని కోరారు. గాలి, నీరు, భూమిని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. "హైదరాబాద్ నగరం ఐటి హబ్ గా అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్నా, మన చుట్టూ ఉన్న జలవనరులు మాయమైపోవడం పర్యావరణ సమతుల్యతకు పెద్ద ముప్పు అన్నారు. మన భూమిని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది అని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని జాగృతి సొసైటీ లీగల్ సెల్ అధ్యక్షురాలు శివ పార్వతి విజ్ఞప్తి చేశారు. రాబోయే తరాలకు పచ్చని భూమిని అందించేలా పర్యావరణ హిత సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆమె మీడియా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద మల్లేష్, మురళి, వీర రెడ్డి గారితో పాటు పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు, స్థానిక ప్రజలు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# కాళేశ్వరం కేసులో న్యాయం గెలిచింది

- పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పుకు హర్షం
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవి కిరణ్

జహీరాబాద్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పుపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవి కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్లేనని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని అన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని తెలిపారు.

## కల్లంలో కాలి బూడిదైన మిర్చి

**-ఎవరో కావాలని నిప్పు పెట్టారని కౌలు రైతు శ్రీనివాస్ ఆవేదన**

**-కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**



కారేపల్లి,ఏప్రిల్ (విజన్ ఆంధ్ర) కల్లం లో ఎండబెట్టిన మిర్చి కాలి బూడిదైన ఘటన కారేపల్లి మండలం ఎర్రబోడు సమీపంలోని ఊటవాగు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మాణిక్యారం గ్రామపంచాయతీ గుడి తండాకు చెందిన కౌలు రైతు,బాధితుడు అజ్మీరా శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడు కనికరపు నరసింహారావుకు చెందిన రెండు ఎకరాలు తాను కౌలుకు తీసుకొని మిర్చి పంట వేశానన్నారు. కూలీలతో ఏరించి, ఊటవాగు సమీపంలోని దేవుని చింత వద్ద కల్లం లో ఎండబెట్టానన్నారు. మంగళవారం మధ్యాహ్నం తాను భోజనానికి వెళ్లి,రాత్రి 8 గంటల సమయంలో కల్లం వద్ద పడుకోవటానికి వెళ్ళగా, మిర్చి కాలిపోయి ఆవేదనగా తెలిపాడు. పది క్వింటాళ్ల మిర్చిని ఎవరో కావాలనే కాలబెట్టారని, తనకు రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదనగా తెలిపారు. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని బుధవారం తాను కారేపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు అజ్మీరా శ్రీనివాస్ తెలిపారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలను ప్రశ్నించిన వ్యక్తిపై కూలీల దాడి. పోలీసులకు పిర్యాదు



నిర్మల్, ఏప్రిల్ 22. ( విజన్ప ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించిన పుట్టి సాగర్ పై తేది 21/ 04/ 2026 న మాట్లాడుదాం అని కూలీ పని ప్రదేశానికి పిలిచి ఎంచెట్టి శ్రీనివాస్, ఆకుల రమణ, ఠాకూర్ కిరణ్ తనపై పై దాడి చేసారని ఎంచెట్టి శ్రీనివాస్ తన చొక్కా చింపగా మిగిలినవారు బూతులు తిట్టారని వారిపై నిన్న కలెక్టర్ కు పిర్యాదు చేసి నేడు లక్ష్మణచాంద పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన బాధితుడు పుట్టి సాగర్ నేడు లక్ష్మణ్ చంద పోలీస్ స్టేషన్లో ఎస్సై గారిని కలిసి వారిపై ఫిర్యాదు చేయడం జరిగింది.

## ఝరాసంగంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహణ

- చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య

జహీరాబాద్ ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర) : సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం గ్రామంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య ఈ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.సౌజన్య మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలకు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాలను నివారించి గ్రామాలను బాల్యవివాహ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పాక్సో చట్టం (పోకసో యాక్ట్ ) ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు విధిస్తున్నట్లు వివరించారు. అలాగే డొమెస్టిక్ వైలెన్స్ చట్టం ద్వారా మహిళలకు కుటుంబ హింస నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాలను సంప్రదించవచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ 15100 ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ పి.క్రాంతి కుమార్, మండల ప్రజాపరిషత్ అధికారి, బాలల సంరక్షణ అధికారి, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ కుట్రలకు హైకోర్టు చెంపపెట్టు!

## పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కొట్టివేతతో బిఆర్ఎస్ శ్రేణుల ఉత్సాహం.. చింతల్‌లో ఘనంగా సంబరాలు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 (విజన్ ఆంధ్ర): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్షపూరిత రాజకీయాలకు హైకోర్టు తీర్పు ఒక బలమైన చెంపపెట్టు అని బిఆర్ఎస్ నాయకులు అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు.

**టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకొని హర్షాతిరేకాలు**

బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకున్న



పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసిన కేసీఆర్ పై బురదజల్లేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన ప్రయత్నం అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు.

**నివేదికలో పస లేదు.. అంతా రాజకీయ కక్షే!**

“కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎడారిగా మారిన తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ ది. అటువంటి మహోన్నత నాయకుడిని, మాజీ మంత్రి హరీష్ రావును, ఉన్నతాధికారులను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ‘దొంగ కమిషన్లను’ ఏర్పాటు చేసిందన్నారు. హైకోర్టు తీర్పుతో ఈ నివేదికలో ఎటువంటి వాస్తవం లేదని, ఇదంతా ప్రభుత్వ కుట్ర అని తేలిపోయింది అని పేర్కొన్నారు.”

**చిల్లర రాజకీయాలు మానుకోవాలి**

అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తోందని నాయకులు విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష్యపూరిత రాజకీయాలు పక్కన పెట్టి, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సంబరాలలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.